సాక్షి రంగారెడ్డి

గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



సమన్యాయమే లక్ష్యం

అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యంమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. 8లో▸



అవిశ్వాసం

ఉప్పరిగూడ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్ శంకర్‌కు పదవీగండం ముంచుకొచ్చింది. 8లో▸



విడతల వారీగా అభివృద్ధి

విడతలవారీగా నియోజకవర్గంలో గ్రామాలను అభివృద్ధి చేయనున్నట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 8లో▸

బిల్లులు రాక.. అప్పులు తీరక!

'మన ఊరు మనబడి' పథకానికి నిధుల గండం

- ఇప్పటికే చేసిన పనులకు అందని బిల్లులు
- రోజుల తరబడి కలెక్టర్ లాగిన్‌లోనే ఫైళ్లు
- అధికారుల చుట్టూ కాంట్రాక్టర్ల ప్రదక్షిణలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'మన ఊరు– మనబడి' పథకం కింద పలు పాఠశాలల్లో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు ఆర్థికఇబ్బందులు తప్పడం లేదు. చేపట్టిన పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు బిల్లులు రాక.. చేసిన అప్పులు కుప్పలుగా పేరుకు పోతుండటంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. చిన్నచిన్న బిల్లుల కోసం విద్యాశాఖాధికారి, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పథకంలో భాగంగా జిల్లాలో 464 ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ఈ మేరకు రూ.99.45 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అదనపు తరగతి గదులు, ప్రహరీలు, భవనాలకు రంగులతో పాటు ఫర్నిచర్, విద్యుత్, తాగునీరు, డైనింగ్ హాల్, కిచెన్‌షెడ్డు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. ఇప్పటి వరకు 150 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. బహిరంగ మార్కెట్లో మెటీరియల్ ధరలకు ఇంజినీర్లు రూపొందించిన అంచనాలకు పొంతన లేకపోవడంతో పనులు చేసేందుకు మొదట్లో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో మెజార్టీ పాఠశాలల్లోని పనులను ఆయా గ్రామాల సర్పంచులు, పాఠశాల కమిటీ సభ్యులే చేపట్టారు. కొంతమంది అప్పు చేసి పనులు చేపట్టగా, మరికొంత మంది స్థానికంగా ఉన్న డీలర్ల వద్ద ఖాతా పద్ధతిలో మెటీరియల్ తీసుకొచ్చారు. పనులు పూర్తయి



నెలలు గడుస్తున్నా.. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో వారంతా ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది.

ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు

మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద జిల్లెలగూడ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతోపాటు శివరాంపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. రూ.2 కోట్లతో వీటిని కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. ఆ తర్వాత మొదటి విడతలో 464 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి, వీటిలో 448 పాఠశాలలకు రూ.97.88 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. రూ.30 లక్షలకు లోబడి ఉన్న 345 పాఠశాలల్లో ఇంజనీరింగ్ విభాగం ద్వారా పనులు చేపట్టగా, వీటిలో ప్రస్తుతం 54 పాఠశాలల్లో పనులు పూర్తి చేశారు. మిగిలిన వాటిలో ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. రూ.30 లక్షలకుపైగా అంచనా వ్యయంతో టెండర్ ద్వారా పనులు చేపట్టారు. ధరలు గిట్టుబాటు కాకపోవడంతో ఈ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు. కొన్నిచోట్ల ప్రారంభమైనా.. మెజార్టీ పాఠశాలల్లో పెండింగ్‌లోనే ఉన్నాయి. కాంట్రాక్టర్లు ముందుకు రాని ప్రాంతాల్లో ఏ విధంగా పనులు చేపట్టాలనే అంశంపై అధికారులు తర్జనభర్జన పడుతుండగా, ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడం.. కోడ్ కారణంగా కొత్త పనుల ప్రారంభం నిలిచిపోవడం.. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం.. ఇప్పటి వరకు గ్రౌండింగ్ కాని పనులను నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేయడం తెలిసిందే. పేరుకుపోయిన బిల్లులు చెల్లిస్తే కానీ కాంట్రాక్టర్లు కొత్త పనులు చేపట్టే పరిస్థితి లేకపోవడంతో మౌలిక సదుపాయాల లేమితో ఆయా పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

అభివృద్ధి పనుల అంచనా ఇలా..

అంశం	కేటాయించిన బడ్జెట్
అదనపు తరగతి గదుల నిర్మాణం	రూ.29,91,50,058
తాగునీటి సరఫరా పనులు	రూ.5,97,34,702
ప్రహరీల నిర్మాణం	రూ.4,88,70,392
విద్యుద్దీకరణ పనులు	రూ.8,17,26,500
డైనింగ్ హాల్స్	రూ.20,11,31,113
టాయ్‌లెట్స్ విత్ రన్నింగ్ వాటర్	రూ.6,64,40,861
కిచెన్ షెడ్ల నిర్మాణం	రూ.2,39,50,261
మేజర్ అండ్ మైనర్ వర్క్స్	రూ.24,35,55,927



ఉద్యోగానందం



వైద్యారోగ్య శాఖ పరిధిలోని స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు అర్హత పొందిన 6,956 మందికి బుధవారం ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా స్టేడియంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. నియామక పత్రాలు అందుకున్న వారు కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి సంతోషాన్ని పంచుకున్నారు.



న్యూస్‌రీల్

కిషోర బాలికలకు స్వయం ఉపాధి శిక్షణ

మొయినాబాద్: కిషోర బాలికలకు స్వయం ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం జిల్లా అధికారి శైలకుమారి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని చిలుకూరులో ఉన్న దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం)లో బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సుల్లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. 14–18 సంవత్సరాల మధ్య వయసున్న కిషోర బాలికలు రెండు ఫొటోలు, ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 76600 22524 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నూతన నియామకం



దాదె మహేశ్

షాబాద్: నెహ్రూ యువ కేంద్ర జిల్లా అడ్వయిజరీ కమిటీ మెంబర్‌గా దాదె మహేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు నెహ్రూ యువ కేంద్రం జిల్లా కార్యాలయంలో బుధవారం జిల్లా అధికారి ఐజయ్య చేతుల మీదుగా నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ..జిల్లాలో యువజన సంఘం బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.క్రీడలు, సమాజ సేవలో యువత పాల్గొనేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.తనకు పదవీ బాధ్యతలు అప్పగించినందుకు కేంద్రమంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన న్యాక్ బృందం



న్యాక్ బృందం సభ్యులకు స్వాగతం పలుకుతున్న కళాశాల అధ్యాపకులు

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం నేషనల్ అసెస్‌మెంట్, అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) బృందం సభ్యులు సందర్శించారు. కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా ప్రమాణాలు, కళాశాల నిర్వాహణ తదితర అంశాలను పరిశీలించారు. న్యాక్ బృందం చైర్‌పర్సన్ డాక్టర్ బుద్ధిన్ గోగోయ్, కోఆర్డినేటర్ డాక్టర్ రాజేష్, షిండే, సభ్యుడు రాజేంద్ర కులకర్ణి కళాశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పూర్వ విద్యార్థులతో మాట్లాడి కళాశాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించారు. కళాశాలలో ఉన్న ప్రయోగశాలలు, గ్రంథాలయం, తాగునీటి ప్లాంట్, సోలార్ ప్లాంట్, ఇంటర్‌నెట్ సదుపాయం, మరుగుదొడ్ల నిర్వహణ, బొటానికల్ గార్డెన్, కంపోస్టు, ఇంకుడు గుంతలను పరిశీలించారు. విద్యార్థులు సాధించిన ఫలితాలు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల, వైస్ ప్రిన్సిపాల్ భాను ప్రకాష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి

జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి



కేతిరెడ్డిపల్లిలో ఉన్నత పారశాల ప్రహరీని ప్రారంభించిన జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

మొయినాబాద్‌రూరల్: కేసీఆర్ పాలనలోనే గ్రామాలు ఆదర్శంగా అభివృద్ధి చెందాయని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లిలో జిల్లా పరిషత్ నిధులు రూ.26 లక్షలతో చేపట్టిన జిల్లా పరిషత్ పాఠశాల ప్రహరీ, అంబేడ్కర్ కాలనీలో సీసీ రోడ్డు, చాకలిగూడలో సీసీ రోడ్డును బుధవారం సర్పంచ్ శోభావెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం గ్రామాల్లో ఎక్కడ చూసినా మిషన్ భగీరథ నీళ్లు, సీసీ రోడ్లు, పాఠశాలల అభివృద్ధే కనిపిస్తోందన్నారు. ఇదంతా కేసీఆర్ పాలనలో, సర్పంచ్‌ల కృషితో జరిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కాలె శ్రీకాంత్, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు జీవంతు, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాహుఫ్, మాజీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ సిద్ధయ్య, పంచాయతీ కార్యదర్శి తారాబాయి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

సమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎల్బీనగర్ నియోజకవర్గంలోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శశాంక తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని స్థానిక సమస్యలు, భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం, కందుకూర్ ఆర్డీఓలు అనంత రెడ్డి, సూరజ్ కుమార్, తహసీల్దార్‌లు, పరిశ్రమల జీఎం రాజేశ్వర్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందాలి

కేశంపేట: ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందేలా విధులు నిర్వర్తించాలని జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ అంజిలప్ప అన్నారు. హైదరాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో బుధవారం నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ నాన్‌గెజిటెడ్ వెటర్నరీ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి, కార్యదర్శి రాజీవ్ పైలెట్, అసోసియేట్ అధ్యక్షుడు నర్సింహ, కోశాధికారి రమేష్ పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ అంజిలప్ప

అభివృద్ధి పనులు భేష్

- మోడల్ జీపీ క్లస్టర్ ప్రాజెక్ట్ టీం లీడర్ దిలీప్‌కుమార్ పాల్

కడ్తాల్: గ్రామ పంచాయతీ అభివృద్ధిలో రూపకల్పన చేసిన ప్రణాళిక, అభివృద్ధి పనులు బాగున్నాయని మోడల్ జీపీ క్లస్టర్ ప్రాజెక్ట్ టీం లీడర్ దిలీప్‌కుమార్ పాల్ ప్రశంసించారు. జాతీయ గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో మణిపూర్, నాగాలాండ్, ఒడిశా, బీహార్, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, జమ్ముకశ్మీర్, మహారాష్ట్రకు చెందిన 50 మందితో కూడిన బృందం బుధవారం మండల కేంద్రంలో పర్యటించింది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు, పంచాయతీ ఆదాయ వ్యయాలను బృందం సభ్యులు సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి వసతికి తీసుకుంటున్న చర్యలు, పంచాయతీ సిబ్బంది పనితీరు, పల్లెప్రగతి, హరితహారం, ప్రజాపాలన సంబంధిత కార్యక్రమాల గురించి సర్పంచ్ వారికి వివరించారు. అనంతరం పంచాయతీ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన రైతువేదిక, పల్లె ప్రకృతివనం, వైకుంఠధామం, నర్సరీలను బృందం సభ్యులు పరిశీలించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు బుద్ధచంద్రసింగ్, రతన్‌రాజు, నారాయణ మాలిక్, శ్రీతం కల్తా, కుమార్ శుభం, ఉపేందర్, కన్నయ్య, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన బృందం సభ్యులు

ఎంక్వయిరీ



బందరావిరాలలోని మైనింగ్‌జోన్

- మైనింగ్ జోన్‌లో కొనసాగుతున్న సర్వే
- అక్రమార్కులపై చర్యలకు సిద్ధం
- క్వారీల నిర్వాహకుల్లో గుబులు

అబ్దుల్లాపూర్‌మెట్ : జిల్లాల్లోనే అతి పెద్ద మైనింగ్ జోన్ అయిన బందరావిరాల సర్వేనంబర్ 268లోని క్వారీల్లో కొన్ని నెలలుగా కొనసాగుతున్న అక్రమ మైనింగ్‌పై అధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు ఎలక్ట్రానిక్ టోటల్ స్టేషన్ (ఈటీఎస్) ఏజెన్సీ సంస్థ సర్వే నిర్వహిస్తోంది. 20 రోజులుగా సర్వే కొనసాగుతోంది. ఇక్కడ 45కు పైగా ఉన్న క్వారీల్లో దాదాపు 30 క్వారీల్లో అక్రమంగా మైనింగ్ తవ్వకాలు జరుగుతున్నట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం సర్వే చేస్తున్న ఏజెన్సీ సంస్థ పూర్తిస్థాయిలో నివేదిక అందించిన తర్వాత మైనింగ్ శాఖ అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించనున్నారు. ఎంత మేరకు అక్రమ తవ్వకాలు జరిగాయో తేలిన అనంతరం క్వారీల యజమానులపై కొరడా ఝుళిపించే అవకాశాలున్నట్లు సమాచారం. దీంతో అధికారులు, ప్రభుత్వం తమపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనన్న గుబులు క్వారీల యజమానుల్లో నెలకొంది. అయితే సంబంధిత అధికారులు మైనింగ్ జోన్‌లో చోటుచేసుకుంటున్న అక్రమాలను బయటకు తీసి చర్యలు తీసుకుంటారా.. లేదంటే కప్పిపుచ్చి క్వారీ యజమానులకు మేలు చేస్తారా అన్న సందేహాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి.

ఇప్పటి దాకా 200 కేసులు..

ఒక వైపు క్వారీల్లో సర్వే చేస్తూనే మరోవైపు రహదారిలో రూట్ చెక్ చేపడుతున్నాం. అక్రమంగా కంకర, మట్టిని తరలిస్తున్న లారీలను అడ్డుకుంటున్నాం. వే బిల్లులు లేకుండా, ఓవర్ లోడుతో వెళ్తున్న లారీలను ఇప్పటికే గుర్తించి జరిమానాలు విధించాం. రాత్రి సమయాల్లో మైనింగ్‌జోన్ పరిసరాల్లో పలుమార్లు తనిఖీలు చేపట్టాం. ఇప్పటి వరకు 200 కేసులు నమోదు చేయడంతో పాటు రూ.22లక్షల మేర జరిమానా విధించాం. సర్వే పూర్తయిన తర్వాత అక్రమాలు తేలితే చర్యలు తీసుకుంటాం.

– ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఏడీ, జిల్లా మైనింగ్‌శాఖ

భయపెట్టిన ఆర్టీసీ బస్సు

- బ్రేకు ఫెయిలై వాహనాలపైకి దూసుకెళ్లిన వైనం..

హయత్‌నగర్: రోడ్డుపై వెళ్తున్న ఆర్టీసీ బస్సు బ్రేకు ఫెయిల్ కావడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో మూడు ద్విచక్రవాహనాలు, ఒక కారు, ఒక ఆటో స్వల్పంగా దెబ్బ తినగా ఓ మహిళకు గాయాలయ్యాయి. ఆర్టీసీ అధికారుల కథనం ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన బస్సు (టీఎస్ 07జెడ్4106) బుధవారం ఉదయం చౌటుప్పల్ నుంచి దిల్‌సుఖ్‌నగర్‌కు వస్తోంది. హయత్‌నగర్‌లోని భాగ్యలత సమీపంలోకి రాగానే రహదారిపై ఉన్న ఓ రాయి బస్సు కింది భాగంలో తగిలింది. దీంతో డ్రైవర్ ధర్మయ్య బ్రేకు వేసేందుకు యత్నించగా బస్సు ఆగలేదు. బ్రేకు పడకపోవడంతో బస్సు ఎడమ వైపునకు వెళ్లింది. దీంతో రోడ్డుకు ఎడమ వైపున ఉన్న వాహనాలపైకి వెళ్లింది. స్పందించిన డ్రైవర్ ముందు బ్రేకును వేయడంతో బస్సు అదుపులోకి వచ్చింది. రోడ్డు పక్కన నిలబడి ఉన్న ఓ మహిళతో పాటు మరికొందరికి స్వల్పంగా గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఆర్‌ఎం వరప్రసాద్, డీఆర్‌ఎంలు జగన్, సుచరిత, డీఎం శ్రీహరి సందర్శించారు. బస్సు డ్రైవర్ అప్రమత్తతో ప్రమాదం తప్పిందని వారు తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనం

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం కావాలి
- ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి డాక్టర్ మల్లురవి

కడ్తాల్: శాసనసభ ఎన్నికల్లో పనిచేసిన విధంగానే పార్టీ శ్రేణులు ముమ్మరంగా పనిచేయాలని.. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కృషి చేయాలని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధి డాక్టర్ మల్లురవి పిలుపునిచ్చారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా బుధవారం కడ్తాల్ మండల కేంద్రానికి విచ్చేసిన ఆయనకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా మల్లురవి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన సాగుతోందని అన్నారు. ప్రజాభీష్టం మేరకు అధిష్టానం ఆదేశిస్తే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి పోటీలో నిలుస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీతోనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం ఉందని, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని, రాహుల్‌గాంధీ ప్రధాని కావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో రాష్ట్రం నుంచి అత్యధిక సీట్లు గెలిపించి రాహుల్‌ను ప్రధానిని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కమ్లీమోత్యా నాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మల్లురవికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఇతర నాయకుల

ప్రజలు కోరుకుంటే నాగర్‌కర్నూల్ బరిలో నిలుస్తా

ఆమనగల్లు: ప్రజలు కోరుకుంటే, అధిష్టానం ఆదేశిస్తే నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలుస్తానని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి డా.మల్లురవి అన్నారు. ఎంపీగా పోటీచేయడానికి తన పదవి అడ్డుకాదన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి ఆమనగల్లుకు వచ్చిన ఆయనకు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డా.మల్లురవి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు పార్టీ ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసి తీరుతామని చెప్పారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, సభ్యులు అయిల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య, జిల్లా నాయకులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

ఆమనగల్లు: మూడవ ఓపెన్ టూ ఆల్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోస్టర్లను ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం మాట్లాడుతూ.. ఈ నెల 15 నుంచి 17వరకు మూడు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఓపెన్ బాలురు, బాలికలు, ఓపెన్ స్కూల్ బాలురు, ఓపెన్ స్కూల్ బాలికల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.20,116 నగదు, రెండవ బహుమతిగా రూ.10,116 నగదు, మూడో బహుమతిగా రూ.5,116 నగదు బహుమతితో పాటుగా షీల్డు అందిస్తున్నామని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు సత్యం, శ్రీనివాస్‌రెడ్డి, కేశవులు, జంగయ్య, నర్సింహ, జగన్, మానయ్య, రవీందర్‌నాయక్, కృష్ణనాయక్, ఖలీల్ తదితరులున్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

9 నుంచి లోక్‌సభ స్థాయి క్రికెట్ టోర్నీ

- కొండా వెంకటరంగారెడ్డి, కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీలు
- విజేతలకు రూ.5 లక్షల నగదు బహుమతి

చేవెళ్ల: ఈ నెల 9 నుంచి చేవెళ్ల పార్లమెంట్ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సన్నాహాలు చేస్తున్నారని నిర్వాహకులు అత్తెల్లి అనంత్‌రెడ్డి చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొండా వెంకటరంగారెడ్డి, మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని కేవీఆర్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పార్లమెంట్ పరిధిలోని చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూరు, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం నియోజకవర్గాల పరిధిలోని క్రికెట్ జట్లు పాల్గొనవచ్చునని చెప్పారు. టోర్నమెంట్‌లో మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.3 లక్షలు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.2లక్షల నగదు బహుమతి ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. ఈ టోర్నమెంట్ నిర్వహకులుగా అనంత్‌రెడ్డితోపాటు కిట్టు, బి.చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీన్‌చారి, నవీన్, గణేశ్, మహేశ్వర్‌రెడ్డి ఉంటారని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే జట్లు తమ పేర్లు నమోదుకు 9849153278, 7893122562, 9849007513 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీఓ

యాచారం: ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి బుధవారం యాచారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. కొత్తపల్లి గ్రామంలో సర్వే నంబరు 249లో మాజీ సీఎస్ సోమేష్‌కుమార్ తన భార్య పేరిట కొనుగోలు చేసిన వ్యవసాయ భూమి వివరాలను తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సమస్యలపై ఆరా తీశారు. ఓ కోర్టు విచారణ నిమిత్తం నల్లవెల్లి రెవెన్యూ పరిధిలో పర్యటించి వివరాలు సేకరించారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజల పట్ల స్నేహ పూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు.

కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా శేఖర్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం/ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీగా మండల పరిధిలోని ఎల్మినేడు గ్రామానికి చెందిన మంకాల శేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. బుధవారం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి జిల్లా కమిటీలో చోటు దక్కడం గర్వంగా ఉందన్నారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు.

రెండు బైక్‌లు ఢీ..

- యువకుడి దుర్మరణం
- మరొకరికి తీవ్రగాయాలు


హనుమంతు(ఫైల్)

మహేశ్వరం: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ దుర్ఘటన మంగళవారం రాత్రి మన్సాన్‌పల్లి సమీపంలోని రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయ సమీపంలో చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. మహేశ్వరం గ్రామానికి చెందిన చిప్పిశెట్టి హనుమంతు(29) ప్రైవేట్ ఉద్యోగి. మంగళవారం రాత్రి 10.45గంటల సమయంలో బంధువుల ఇంటి వద్దనుంచి వస్తుండగా ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హనుమంతు తలకు గాయమవ్వడంతో తీవ్రరక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. మరొక వ్యక్తి శివకు బలమైన గాయాలవ్వడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బుధవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

అధికారం కోసమే మోదీ యత్నం

రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

యాచారం: కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రావడం కోసమే నరేంద్ర మోదీ అయోధ్య పేరుతో విశ్వప్రచారం చేసుకుంటున్నారని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. ఫిబ్రవరి 16న ప్రజా సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చిన మేరకు బుధవారం నందివనపర్తి, ధర్మన్నగూడెం తదితర గ్రామాల్లో ఇంటింటికి కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో రెండు దఫాలుగా అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం రైతాంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఫిబ్రవరి 16న జరిగే బంద్‌ను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పి.అంజయ్య, మల్లేశ్, చందునాయక్, జంగయ్య, భాషయ్య, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమన్యాయమే కాంగ్రెస్ లక్ష్యం

- ఆదర్శ పంచాయతీగా ఎల్మినేడు
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


ఎల్మినేడు గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకుపోతోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని ఎల్మినేడులో సర్పంచ్ అశోక్‌వర్ధన్‌రెడ్డితో కలిసి పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గమంతా మెజార్టీ ఒక ఎత్తైతే.. ఎల్మినేడులో లీడ్ రావడం సంతోషానిచ్చిందన్నారు. ఈ గ్రామాన్ని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతానన్నారు. గత పాలకులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందడం ఖాయమన్నారు. సొంతిళ్లు నిర్మించుకునే వారికి రూ.5లక్షలు అందజేస్తామన్నారు. గ్రామంలో 700 కుటుంబాలుంటే 500 కుటుంబాలు సర్వేనంబర్ 512లో భూములు కోల్పోతే పరిహారం కోసం ప్రజల పక్షాన పోరాడామని గుర్తు చేశారు. గత పాలకులు దోచుకోవడం.. దాచుకోవడం మీదే దృష్టి సారించారని అంతాకక్కిస్తామన్నారు.

ఘన స్వాగతం

ఎమ్మెల్యేకు డోలు వాయిద్యం, గుస్సాడి కోయ, లంబాడి సంప్రాదయ నృత్యాలు, మహిళలతో కోలాటాలు, వేద బ్రాహ్మణలు, సన్నాయి కళాకారులతో ఘన ఎల్మినేడు సర్పంచ్ అశోకవర్ధన్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే తలకు పగిడి పెట్టి గుర్రం బగ్గిమీద పూలవర్షంతో ఊరేగించారు.

కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్

కార్యక్రమం అనంతరం గ్రామ సర్పంచ్ ఎడమ అశోకవర్ధన్‌రెడ్డి నివాసానికి ఎమ్మెల్యే రంగారెడ్డి వెళ్లి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్, జెడ్పీటీసీ సభ్యుడు మహిపాల్, వైస్ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్ రెడ్డి, ఉప సర్పంచ్ మార్తా, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీలో చేరిన సర్పంచ్ అశోకవర్ధన్‌రెడ్డి

ఏఈఓల సంఘం డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల, ఏఈఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: వ్యవసాయ శాఖ తెలంగాణ ఏఈఓల సంఘం 2024-డైరీని బుధవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆవిష్కరించారు. నగరంలోని హార్టికల్చర్ ట్రైనింగ్ కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఈఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యలాల శ్రావణ్ కుమార్, సెక్రటరీ రాము, కోశాధికారి రాజు పాలక వర్గం సభ్యులు పాల్గొన్నారు.

'జలశక్తి' కేంద్ర బృందం పర్యటన

మంచాల: మండల పరిధిలోని ఆరుట్ల, మంచాల గ్రామాల్లో బుధవారం జలశక్తి అభియాన్ కేంద్ర బృందం పర్యటించింది. ఆయా గ్రామాల్లో ఎన్ఆర్ఈజీయస్ నిధుల ద్వారా నిర్మించిన వర్షాధార నీటి నిల్వకుంటల పనులను పరిశీలన చేశారు. అదే విధంగా వ్యక్తి గత ఇంకుడు గుంతలు, సామాజిక ఇంకుడు గుంతలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జలశక్తి అభియాన్ కేంద్ర డిప్యూటీ సెక్రెటరీ అమిత్ మిశ్రా, సైంటిస్ట్ అంకిత్ విశ్వకర్మ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అదనపు అధికారి నీరజ, ఇబ్రహీంపట్నం క్లస్టర్ అధికారి సక్రియా నాయక్, ఏపీఓ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న జలశక్తి అభియాన్ కేంద్ర బృందం

పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం


డీసీఓ ధాత్రిదేవికి నోటీసు అందజేస్తున్న ఉప్పరిగూడ సంఘ సభ్యులు

- డీసీఓ ధాత్రిదేవికి నోటీసు అందజేసిన సంఘ సభ్యులు

ఇబ్రహీంపట్నం: ఉప్పరిగూడ ప్రాథమిక సహకార సంఘం(పీఏసీఎస్) చైర్మన్ టీకుల సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్ క్యామ శంకర్‌లకు పదవీగండం ముంచుకొచ్చింది. వారిని పదవి నుంచి తొలగించాలని జిల్లా కోఆపరేటివ్ అధికారిణి ధాత్రిదేవికి 11 మంది సంఘం సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. ఈ మేరకు తీర్మాణం చేసి బుధవారం జిల్లా కోఆపరేటివ్ అధికారిణి ధాత్రిదేవికి నోటీసు అందజేశారు. ఈ సంఘానికి సభ్యులను రైతులు పార్టీలకు అతీతంగా ఎన్నుకుంటారు. అయితే బీఆర్ఎస్ పార్టీకి చెందిన సుదర్శన్‌రెడ్డి సంఘం చైర్మన్‌గా కొనసాగుతున్నారు. సంఘంలో 13 మందికిగాను చైర్మన్, వైస్ చైర్మన్ మినహా మిగతా సభ్యులంతా ఒక్కటై అవిశ్వాసానికి తెరలేపారు.

పదవి కోసం పావులు

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాండు రంగారెడ్డి చైర్మన్ పదవిని ఆశించి బీఆర్ఎస్‌కు చెందిన టీకుల సుదర్శన్‌రెడ్డిని ఆ పదవి నుంచి తప్పించేందుకు పావులు కదుపుతున్నారంటూ పలువురు చర్చించుకుంటున్నారు. మూడేళ్ల తర్వాత చైర్మన్, వైస్ చైర్మన్ల పై అవిశ్వాసం పెట్టేందుకు సహకార చట్ట ప్రకారం అవకాశం ఉంది. ప్రస్తుతం పాలకవర్గం కొలువుదీరి నాలుగేళ్లయింది. మరో ఏడాది పాటు చైర్మన్, వైస్ చైర్మన్లకు కొనసాగే అవకాశం ఉన్నా సభ్యులు మాత్రం అవిశ్వాసానికి తెరలేపారు. ఇప్పటికే సంఘం సభ్యులంతా క్యాంపునకు తరలించినట్లు తెలుస్తోంది.

విడతల వారీగా గ్రామాల అభివృద్ధి


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: విడతలవారీగా నియోజకవర్గంలో గ్రామాలను అభివృద్ధి చేయనున్నట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని ఎస్‌బీపల్లి గ్రామంలో బుధవారం సర్పంచ్ అంబటి ప్రభాకర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీజీఎఫ్ నిధులు రూ.10లక్షలతో నిర్మించ తలపెట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు మంజూరు చేసేలా కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, నాయకులు హరినాథ్‌రెడ్డి, బాల్‌రాజ్, సురేష్‌గౌడ్, పంచాయతీ పాలకవర్గం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


సాదియా తబ్బసుమ్ (ఫైల్)

పహాడీషరీఫ్: తండ్రి మందలించడంతో ఓ యువతి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై షేక్ యూసుఫ్ జానీ తెలిపిన ప్రకారం.. షాహీన్‌నగర్ ఝుంఝుం కాలనీకి చెందిన మహ్మద్ జబ్బార్ మూడో కుమార్తె సాదియా తబుస్సుమ్(21)ను జనవరి 30న పనివిషయంలో మందలించాడు. అదే రోజు సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన యువతి తిరిగి రాలేదు. బుధవారం తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది. ఆచూకీ తెలిసిన వారు 87126 62366 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

చెరువులో మునిగి యువకుడి మృతి


మహేశ్ (ఫైల్)

మంచాల: చెరువులో మునిగి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఆరుట్లలో బుధవారం చోటు చేసుకుంది. మంచాల ఎస్ఐ రవినాయక్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన నూకం మహేశ్(26) వృత్తి రీత్యా సెంట్రింగ్ కూలి. మంగళవారం ఉదయం 11గంటలకు ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రమైనా తిరిగి రాలేదు. అతని సోదరుడు ఆరాతీయగా స్నేహితులతో కలిసి పటేల్‌చెరువు తండా సమీపంలో కల్లు తాగేందుకు వెళ్లాడు. స్నేహితులు కొద్ది దూరంలో ఉండగా మహేశ్ చెరువులో మునిగాడు. అనుమానంతో చెరువు పరిసరాల్లో పరిశీలించగా గట్టు సమీపంలో అతని దుస్తులు, చెప్పులు, సెల్‌ఫోన్ కనిపించాయి. బుధవారం చెరువులోకి దిగి వెతక్కగా మహేశ్ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

బావిలో పడిన మహిళకు తీవ్ర గాయాలు


కేతిరెడ్డిపల్లిలో ఇళ్ల మధ్య ప్రమాదకరంగా ఉన్న పాడుబడిన బావి

మొయినాబాద్: ఇంటి ఎదుట పాడుబడ్డ బావిలో పడి ఓ మహిళ తీవ్ర గాయాలపాలైంది. ఈ సంఘటన మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి యాదమ్మ మంగళవారం రాత్రి బాత్‌రూంకు వెళ్లేందుకు బయటకు వచ్చింది. ఇంటి ఎదుట పాడుబడ్డ బావి ఉండటంతో ప్రమాదవశాత్తు అందులో పడింది. బయటకు వెళ్లిన యాదమ్మ ఎంతకీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఇంట్లో నుంచి బయటకు వచ్చారు. బావిలో నుంచి అరుపులు వినిపించడంతో చుట్టుపక్కలవారిని పిలిచారు. తాళ్ల సహాయంతో బావిలోకి దిగి యాదమ్మను బయటకు తీశారు. బావిలో పడటంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా.. గతంలోనూ ఈ బావిలో పడి ఓ మహిళ మృతి చెందిందని పలువురు గాయపడ్డారని.. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న బావిని పూడ్చివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.